

రిజిస్ట్రార్ పదవి ఎవరికో?

కేయూలో కీలకమైన రిజిస్ట్రార్ పదవి ఏ ప్రొఫెసర్‌ను వరించనుందోనని కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది.

- 8లో▸



మా బాపు లబ్బరి కట్టెతో కొట్టాడు..

బడికి పోక పోతే మా బాపు నన్ను లబ్బరి కట్టెతో కొట్టాడని మంత్రి సీతక్క అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
30.7°/19.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చిరుజల్లులు కురుస్తాయి. చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్



మహబూబాబాద్: ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. కాగా బుధవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. రిలే నిరాహార దీక్షలతో పాటు నిరవధిక సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులతో పాటు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగ సంఘం నాయకులు వీరన్న, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుకన్య కుటుంబానికి న్యాయం చేయాలి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన ఉబ్బపెల్లి సుకన్య మంగళవారం సాయంత్రం ఉరివేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా సుకన్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె స్వస్థలం సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద ఆందోళన చేపట్టారు. ఎలాంటి అవాంఛయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడగా సుకన్య మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలని, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని పేర్కొన్నారు. వివాహం జరిగిన నాటి నుంచి అత్తింటివారు అదనపుకట్నం కోసం వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుకన్య భర్త గణేష్, అత్తమామలు ఎల్లమ్మ, ఎల్లయ్యపై వరకట్న వేధింపుల ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు.

మను ధర్మశాస్త్ర ప్రతుల దహనం



నెహ్రూసెంటర్ : కుల వ్యవస్థను తీసుకువచ్చి వృత్తుల వారీగా విభజించిన మనుధర్మ శాస్త్రం ప్రతులను మాలమహానాడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడారు. 1927 డిసెంబర్ 25వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుధర్మశాస్త్రాన్ని దహనం చేశారని గుర్తు చేశారు. దార సాత్విక్, గుర్రం శరత్, పిల్లి సాయి, రంజిత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



మానుకోట సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్ రెవరెండ్ ప్రతాప్



దోర్నకల్ ఎఫిఫనీ చర్చి వద్ద భక్తుల సందడి



జిల్లా కేంద్రంలోని బ్లెస్డ్ చర్చిలో క్రీస్తు జననానికి స్వాగతం పలుకుతూ కొవ్వొత్తులతో ఆరాధన చేస్తున్న క్రైస్తవులు



క్రిస్మస్ సందర్భంగా శాంతా క్లాజ్ సందడి

ఘనంగా క్రిస్మస్..

జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ల పరిధిలోని మండలాలు, గ్రామాలు, తండాల్లో మంగళవారం రాత్రి, బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. యేసుక్రీస్తు జననాన్ని పురస్కరించుకుని అన్ని చర్చిల్లో సందడి వాతావరణం నెలకొంది. శాంతిదూత యేసుక్రీస్తు కరుణ, కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని క్రైస్తవులు ఆకాంక్షించారు. క్రీస్తు చూపిన మార్గంలో నడిచి ఆదర్శంగా నిలవాలని, విశ్వాసంతో ఆరాధించే వారందరిని యేసుక్రీస్తు అనుగ్రహించాలని ప్రార్థించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

- మహబూబాబాద్ రూరల్



క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

- మరిన్ని ఫొటోలు 9లో▸

ధాన్యం.. దైన్యం

తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- మిల్లులకు తరలింపులో మాత్రం తీవ్ర జాప్యం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- కేంద్రాల వద్దనే పడిగాపులు
- ముసురుతో రైతులు ఆగమాగం



బయ్యారం మండల కేంద్రంలో ఆర్‌ఓ ఇవ్వకపోవడంతో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

మహబూబాబాద్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే కేంద్రాల నుంచి మిల్లులకు తరలింపులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆర్‌ఓ ఇవ్వకపోవడంతో కేంద్రాల వద్దనే అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. దీనికితోడు రెండు రోజులుగా ముసురు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా సన్నధాన్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించారు. అయితే అక్కడి మిల్లుల జాబితా ఇవ్వకపోవడంతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

2,15,277 ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో 2,15,277 ఎకరాలలో వరి పంట సాగు చేయగా 2,88,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. దానికి అనుగుణంగా 238 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, నేటి వరకు 224 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. ఈనెల 24వ తేదీ వరకు 1,10,619.00 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. 2,4200 మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యం విలువ రూ.256.47 కోట్లు. ఇందులో రూ.180.25 కోట్లు చెల్లించారు. రూ.18.79 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

మిల్లులకు తరలింపులో తీవ్రజాప్యం..

జిల్లాలో 67 మిల్లులు ఉన్నాయి. అఫిడవిట్ ఇచ్చిన తర్వాత జిల్లాలో 30 మిల్లులకు ధాన్యం కేటాయించారు. జిల్లాలోని మిల్లుల సామర్థ్యం 1,70,000 మెట్రిక్ టన్నులు. కాగా జిల్లాలో 1,10,619.00 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 1,05,168.960 మెట్రిక్ టన్ను ధాన్యం మిల్లులకు తరలించి, 5,450.040 మెట్రిక్ టన్నులు కేంద్రాల్లోనే నిల్వ ఉంచారు.



అన్నారం కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

కేంద్రాల్లోనే పడిగాపులు..

బయ్యారం మండల కేంద్రంతో పాటు కేసముద్రం మండలంలోని అన్నారం కొనుగోలు కేంద్రంతో పాటు పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ ఆర్‌ఓ ఇవ్వకపోవడంతో కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోయాయి. దీంతో రైతులు కూడా కేంద్రాల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. మిల్లులకు తరలించే వరకు బాధ్యత రైతులపై ఉండటంతో కేంద్రాల వద్దనే ఉండాల్సి వస్తోంది. 40 లక్షల గన్నీ బ్యాగులు, 10,000 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

ముసురుతో ఆగమాగం..

తుపాన్ ప్రబావంతో రెండు రోజుల నుంచి ముసురు వర్షం పడుతోంది. చిరుజల్లులతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు, పరదాలు కప్పుకుని తడవకుండా జాగ్రత్తలు పడుతున్నారు. చలితో కేంద్రాల వద్ద నానా కష్టాలు పడుతున్నారు.

ధాన్యాన్ని తరలించాలి..

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో రైతులు విక్రయించిన ధాన్యాన్ని కాంటా వేసి పది రోజులవుతున్నా మిల్లులకు తరలించడం లేదని రైతులు బుధవారం ఆందోళన చేశారు. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు పుల్సాని వెంకటరెడ్డి, కేలోత్ శ్రీను, బానోత్ వీరన్న, రేపాల వీరన్న, చింతమల్ల నాగేష్, చింతమల్ల వీరేందర్, బానోత్ నాన్కు తెలిపారు. వెంటనే ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు.



కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

వెంటనే మిల్లులకు తరలిస్తున్నాం..



కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నాం. 1,10,619.000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 5,450.040 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కేంద్రాల్లో ఉంది. ఇప్పటి వరకు రైతులకు రూ.180.25 కోట్లు చెల్లించాం. రూ.18.79 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సన్నధాన్యం జిల్లాకు 90,000 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇవ్వగా.. మిగిలిన ధాన్యం యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించారు. కానీ మిల్లుల కేటాయింపు చేయలేదు.దీంతో కొంత సమస్య తలెత్తింది. - కృష్ణవేణి, సివిల్ సప్లయీస్ మేనేజర్

వారం రోజులుగా కేంద్రాల వద్దనే..



కేసముద్రం మండలం అన్నారం పీఏసీఎస్ కేంద్రంలో వారం రోజులు క్రితం 30 బస్తాల ధాన్యం విక్రయించాను. కానీ నేటికీ ఆర్‌ఓ ఇవ్వలేదు. మిల్లులకు తరలింపు జరగలేదు.దీంతో కేంద్రం వద్దనే ఉంటున్నాను. కేంద్రంలో 2,000 బస్తాలు నిల్వ ఉన్నాయి.

- పి.శ్రీనివాస్, రైతు

రైలెక్కిన జేసీబీలు

వరంగల్ వైపు నుంచి ఖమ్మం వైపునకు జేసీబీలతో వెళ్తున్న ఓ ప్రత్యేక రైలు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో కాసేపు ఆగింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. రైలు వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

- మహబూబాబాద్ రూరల్



జేసీబీలతో వచ్చిన ప్రత్యేక రైలు

దాతలు స్పందిస్తేనే..

- పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం
- ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- పోషకాహారం అందిస్తే మంచి ఫలితాలు



తొర్రూరు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు

తొర్రూరు: ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలలకు వంద రోజుల ప్రణాళిక ఇచ్చింది. శతశాతం ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. వంద రోజుల ప్రణాళికలో ప్రత్యేకించి పది విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఉండాల్సి వస్తోంది. అప్పటి వరకు వారికి ఎలాంటి ఆహారం లేక నీరసిస్తున్నారు. ఈ క్రమంలో వారికి సాయంత్రం అల్పాహారం అందిస్తే వారు ఉత్సాహంగా, ఏకాగ్రతతో చదివే అవకాశముంది. గతంలో అల్పాహారం అందించగా..ఇప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అత్యంత తక్కువ ఖర్చుతో ఆకలి తీర్చే అవకాశం ఉండటంతో దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

దూర ప్రాంత విద్యార్థులకు అధిక ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉదయం 8 గంటలకే పాఠశాలలకు చేరుకోవాల్సి వస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఉదయం 7.30 గంటలకే ఇంటి నుంచి బయలుదేరుతారు. ఉదయం ఇంటివద్ద ఏమీ తినకుండా హడావుడిగా వస్తున్నారు. తోటి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం 12.40 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. సాయంత్రం 4.15 నుంచి 5.30 వరకు ప్రత్యేక తరగతులు వింటున్నారు. వారు తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి ఏడు గంటలవుతుంది. అప్పటివరకు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. కొందరు బాలలు సరిగా తినకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో చదువులో వెనకబడుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పూర్వ విద్యార్థులు, అధికారులు ఔదార్యం చూపి...అల్పాహారం అందిస్తే విద్యార్థుల ఆకలి తీర్చినవారవుతారు. చదువులోనూ రాణించే అవకాశముంటుంది.

ఔదార్యం చూపాలి..

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. సంస్థలు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానికులు వారి ప్రాంతాల్లోని విద్యార్థులకు ఆహారం అందించాలి. మధ్యాహ్న భోజనం వండే వారికి నిధులిచ్చి.. సాయంత్రం పిల్లలకు అల్పాహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

గతంలో స్పందించిన కలెక్టర్లు..

నాలుగేళ్ల క్రితం వరకు అల్పాహారం పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక నిధులు పంపిణీ చేసింది. ఆ తర్వాత పంపిణీ నిలిచిపోయింది. అయినా గత జిల్లా కలెక్టర్లు స్పందించి సీబీఎఫ్ (క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్) నుంచి నిధులు మంజూరు చేసి విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం ప్రత్యేక తరగతులు ప్రారంభమై నెల రోజులు గడిచాయి. అల్పాహారంపై ఎవరూ దృష్టి పెట్టలేదు. పరీక్షలు మార్చి రెండో వారంలో మొదలవుతాయి. తరగతులు మరో 2 నెలల పాటు సాగుతాయి. అప్పటిదాక వీరి పరిస్థితి ఏమిటనేది ఎవరూ ప్రస్తావించలేదు.

ప్రభుత్వానికి నివేదించాం



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అల్పాహారం అందిస్తే పది విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందనే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. దాతలతో పాటు అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు సైతం తోడ్పాటు అందించాలని కోరుతున్నాం.

- రవీందర్‌రెడ్డి, డీఈఓ

జీపుయాత్రను జయప్రదం చేయండి




మాట్లాడుతున్న సీతారాంనాయక్

నెహ్రూసెంటర్ : లగచర్ల లంబాడీలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో చేపట్టే జీపుయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లంబాడీల అణిచివేతపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. గిరిజనులపై ప్రభుత్వ పాలకుల వివక్షతను ఎండగడుతూ, గిరిజన చట్టాల రక్షణ, అమలు కోసం జీపుయాత్ర చేపట్టామన్నారు. అనంతరం యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు.

వరంగల్ ఐటీ..
గ్లోబల్ కేపబిలిటీ

జీసీసీ ప్లేబుక్‌లో రాష్ట్రంలో నగరానికి రెండో స్థానం

- హైదరాబాద్ తర్వాత ఐటీ అభివృద్ధికి అనుకూలతలు
- నాస్కామ్, అన్ ఎర్త్ ఇన్‌సైట్ అధ్యయనంలో వెల్లడి
- ఎయిర్ పోర్టు, మెట్రో నియోసేవలు వస్తే ఇంకా విస్తృతి
- మిలియన్ చదరపు అడుగులతో సరికొత్తగా క్లస్టర్



“గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రముఖ యూనివర్సిటీలు, 50కిపైగా కాలేజీల ద్వారా 15 నుంచి 20వేల మధ్య గ్రాడ్యుయేట్లు ఏటా బయటకు వస్తున్నారు. దీనివల్ల మానవ వనరులకు కొదవ లేకుండా ఉంది.

సాక్షి, వరంగల్ :

రాష్ట్రంలో 'ఎగ్జిస్టింగ్ అండ్ అప్ కమింగ్ టెక్నాలజీ హబ్స్'లో హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం నిలిచింది. నాస్కామ్, రీసెర్చ్ పార్టనర్ అన్ ఎర్త్ ఇన్ సైట్ ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ప్లేబుక్‌లో నాలుగు నగరాలకు చోటు దక్కితే.. అందులో రెండో స్థానంలో వరంగల్ ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో కరీంనగర్, నిజామాబాద్ చోటు దక్కించుకున్నాయి. హైదరాబాద్ తర్వాత ఇక్కడే ఐటీ కంపెనీల నిర్వహణకు అనుకూల వాతావరణం ఉండడంతో ఇప్పటికే ఎల్‌టీఐ మైండ్ ట్రీ, జెన్‌ప్యాక్, సైయాంట్ లాంటి ముఖ్య కంపెనీలు కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నాయని పేర్కొంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా మంచి పేరున్న 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ)' ఉండడం కూడా ఐటీ అభివృద్ధికి కలిసొచ్చే అంశంగా పేర్కొంది. ఇప్పటికే ఉన్న జాతీయ, రాష్ట్ర రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు మామునూరు ఎయిర్ పోర్టు, ప్రతిపాదిత మెట్రో నియో సేవలు కూడా కార్యరూపం దాలిస్తే ఐటీ కంపెనీల భూమ్ ఇంకా విస్తృతమయ్యే అవకాశముందని చెప్పుకొచ్చింది.



అవకాశాలు ఎందుకున్నాయంటే..

జీసీసీ ఏర్పాటులో స్పెషల్ ఎకానమిక్ జోన్ (సెజ్), వరంగల్ ఐటీ పార్కు కీలకం. అదే సమయంలో కాజీపేట, హనుమకొండ ప్రాంతాలు కూడా ఐటీ కార్యాలయాలకు అలవాలంగా మారనున్నాయి.

- ఇప్పటికే పలు టెక్ సర్వీసెస్ కంపెనీలుండగా, స్టార్టప్ టెక్‌లు కొన్ని ప్రారంభమయ్యాయి. టెక్‌లు, ఆర్ అండ్‌డీ, బీపీఎం ప్రొఫెషనల్స్ వంటి వారితో టాలెంట్ ఫుల్‌గా ఉంది.
- 10 నుంచి 20 మిలియన్ చదరపు అడుగులు, 5 నుంచి 10 మిలియన్ చదరపు అడుగులతో సౌకర్యవంతమైన హౌసింగ్ అండ్ రెసిడెన్షియల్ అందుబాటులోకి రానుంది.1000చదరపు అడుగుల కు రూ. 10 నుంచి రూ.20 వేల అద్దె ఉండనుంది.
- రియల్ ఎస్టేట్ డెవలపర్స్,సెజ్ ప్రొవైడర్ పార్టనర్,ఆఫీసు స్పెసెస్ఇన్ ఐటీ పార్కు,సెజ్‌లతో ఐటీ కంపెనీల విస్తృతి పెరిగే అవకాశముంది. రి క్రూట్‌మెంట్ ఏజెన్సీస్,ఆర్‌పీఓ,స్టాఫింగ్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్,హెచ్‌ఆర్ అండ్ పేరోల్ కంపెనీ లు,యూనివర్సిటీ, విద్యాసంస్థలతో కలిసి పనిచేయడం,స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లతో టాలెంట్ పార్టనర్స్ అందుబాటులో ఉండడం కూడా కలిసొచ్చే అవకాశంగా ఉందని పేర్కొంది.
- స్టార్టప్ పార్టనర్స్‌గా ఇన్నోవేషన్ హబ్స్, ఇంక్యుబేషన్, అక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
- వచ్చే ఐటీ పార్కులు, ఆఫీసు స్పేస్‌లతో టైర్ 2 సిటీలను రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మొదటి దశలో ఉంది.
- ఎస్‌టీపీఐ, వరంగల్ ఐటీ పార్కు, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్), కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, హనుమకొండ ఐటీ పార్కు ఇప్పటికే అందుబాటులోకి వచ్చి వేలాది మందికి ఉపాధి అవకాశాలిస్తున్నాయి.
- ఒక మిలియన్ చదరపు అడుగులతో సరికొత్తగా క్లస్టర్ అందుబాటులోకి రానుందని జీసీసీ బుక్ వెల్లడించింది.

క్లుప్తంగా

తుపాకీతో పోలీసులకు పట్టుబడిన యువకుడు?

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో తుపాకీ(పిస్టల్)తో తిరుగుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గ్రామంలో ఓ యువకుడు తుపాకీతో తిరుగుతుండగా, గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తుపాకీతో తిరుగుతున్న ఆ యువకుడిని, అతడితో ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే అతడి వద్ద లభ్యమైన తుపాకీ నకిలీదా? నిజమైందా?, అసలు ఎక్కడి నుంచి ఆ తుపాకీ వచ్చింది.. దీని వెనక ఎవరున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

భార్యపై కోపంతో భర్త వెకిలి చేష్టలు

- దుస్తులు, గాజులు ప్రధాన కూడళ్లలో వేసిన ప్రబుద్ధుడు
- పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

స్టేషన్‌ఘన్‌పూర్: భార్యపై కోపంతో ఓ వ్యక్తి వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్‌కు చెందిన సురేందర్‌కు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన ఉమతో పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. అయితే ఇటీవల సురేందర్ భార్యపై అనుమానం పెంచుకుని తరచూ కొడుతూ వేధిస్తుండగా ఉమ తన ఇద్దరు పిల్లలతో కలిసి రెండు నెలల క్రితం రాఘవాపూర్‌కు వచ్చింది. దీంతో కోపోద్రేకుడైన సురేందర్ బుధవారం వికృత చేష్టలకు పాల్పడ్డాడు. తన భార్య దుస్తులు, గాజులు, చెప్పులు తదితర వస్తువులను ఆమె స్వగ్రామం రాఘవాపూర్‌లో ప్రధాన కూడళ్లలో వేశాడు. ఆ దుస్తులపై ఆమెను కించపరిచేలా రాశాడు. ఈ ఘటనపై ఉమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంలో యువకుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

జనగామ రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పెద్ద రాంచర్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జిల్లెల్ల రామిరెడ్డి, పద్మ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ (32) బుధవారం తమ వ్యవసాయ భూమిలో పని చేస్తున్నాడు. ఈ సమయంలో వ్యవసాయ మోటార్ పనిచేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్‌లు సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

రిజిస్ట్రార్ పదవి ఎవరికో!

- ఏటూ తేల్చుకోలేకపోతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రొఫెసర్లలో ఒకరికి అవకాశం
- ప్రచారంలో ప్రొఫెసర్ రాంచంద్రం పేరు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కీలకమైన రిజిస్ట్రార్ పదవి ఏ ప్రొఫెసర్‌ను వరించనుందోనని కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కేయూ రిజిస్ట్రార్‌గా గణిత విభాగాచార్యులు పి.మల్లారెడ్డి కొనసాగుతున్నారు. ఆయనకు వచ్చే ఏడాది జనవరి 31 వరకు పదవీ కాలం ఉంది. ఆయన స్థానంలో అర్హులైన వారిని వీసీ నియమించుకునే అవకాశం కూడా ఉంది. వీసీ.. ప్రస్తుతం పని చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఒకే సామాజిక వర్గం కావడంతో ఆయన స్థానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రొఫెసర్లలో ఎవరో ఒకరిని నియమించాలనే డిమాండ్ ఉంది. వివిధ యూనివర్సిటీల్లో నూతన వీసీలు రిజిస్ట్రార్లను మార్చుకున్నారు కూడా. అదేవిధంగా కేయూలోనూ నూతనంగా రిజిస్ట్రార్‌ను తనకు అనుకూలురైన వారిలో ఎవరో ఒకరిని నియమించుకుంటారనే చర్చ సాగుతోంది.

ఒకరికి అవకాశం..

ఎస్సీ సామాజిక వర్గంలో హిస్టరీ విభాగం ప్రొఫెసర్, సోషల్ సైన్స్ డీన్ టి.మనోహర్, కేయూ దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రాంచంద్రం, ఫార్మసీ కళాశాల డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, జువాలజీ విభాగం ప్రొఫెసర్, కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్యులు వై.వెంకయ్య, వర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి ఉన్నారు. ఇందులో మనోహర్ వచ్చే ఏడాది మార్చిలో, రాంచంద్రం జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఎస్టీ సామాజిక వర్గంలో ఎకనామిక్స్ విభాగాధిపతి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు బి.సురేశ్‌లాల్, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ అకడమిక్ ఆడిట్ డీన్ జి.హన్మంతు, జువాలజీ విభాగం ప్రొఫెసర్, కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఈసం నారాయణ ఉన్నారు. బీసీ నుంచి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ ఉండగా.. జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి ఒకటి రెండ్రోజుల్లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందనున్నారు. దీంతో ఆయనకు కూడా రిజిస్ట్రార్ పదవికి అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ఇందులో ఎవరిని రిజిస్ట్రార్ పదవి వరిస్తుందనేది యూనివర్సిటీలో చర్చ నడుస్తోంది.

రిజిస్ట్రార్‌గా రాంచంద్రం!

కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా దూర విద్య కేంద్రం డైరెక్టర్, సీడీసీ డీన్‌గా, సైకాలజీ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వి.రాంచంద్రంను నియమించనున్నారని వారం రోజులుగా యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. రాంచంద్రం నియామకానికే వీసీ మొగ్గు చూపుతున్నట్లు చర్చ జరుగుతోంది. కాగా, ఆరు నెలలకే ఆయన ఉద్యోగ విరమణ ఉండడంతో పునరాలోచనలో పడ్డారా? అనేది కూడా పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల బీసీ సామాజిక వర్గానికి చెందిన కట్ల రాజేందర్‌ను పరీక్షల నియంత్రణాధికారిగా నియమించడంతో ఇక ఎస్సీ సామాజిక వర్గానికే రిజిస్ట్రార్ పదవిని కట్టబెట్టాలనేది ఆ సామాజికవర్గాలకు చెందినవారు వీసీపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఓ ప్రొఫెసర్‌కు రిజిస్ట్రార్ పదవి వరించనుంది.

మల్లారెడ్డిని కొనసాగిస్తారా!

రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్థానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని ప్రొఫెసర్లలో ఎవరో ఒకరిని నియమించుకోవాలనే ఒత్తిడి పెరుగుతోంది. వర్సిటీలో ప్రొఫెసర్ల సంఖ్య తక్కువగా ఉండడం, ఉన్న వారిలోనూ పలువురు ఇప్పటికే ఒకటి రెండు పరిపాలనా పదవులు కూడా నిర్వహిస్తున్నవారు ఉండడంతో ఎవరిని నియమించాలో వీసీ ప్రతాప్‌రెడ్డి తేల్చుకోలేకపోతున్నారు. కేయూ రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డిని వచ్చే ఏడాది జనవరి 31వరకు కొనసాగిస్తారా? లేక త్వరలోనే ఆయన స్థానంలో మరొకరిని నియమిస్తారా? అనే చర్చ సాగుతోంది.

ఓఎస్‌డీగా మల్లారెడ్డి?

కాకతీయ యూనివర్సిటీలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా ప్రస్తుత రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డిని నియమిస్తారనే చర్చ కూడా నడుస్తోంది. ఇటీవల కేయూ పాలక మండలి సమావేశంలో ఓఎస్‌డీ పదవిలో ఓ ప్రొఫెసర్‌ను నియమించుకోవాలని నిర్ణయించి ఆమోదించారు. అయితే రిజిస్ట్రార్‌గానూ, వివిధ పదవులు నిర్వర్తించిన మల్లారెడ్డిని ఓఎస్‌డీగా నియమించి ఆయన సేవలు వినియోగించుకుంటారనే చర్చ ఉంది. లేకుంటే వేరే వారిని నియమిస్తారా? అనేది త్వరలోనే తేలిపోనుంది.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థిని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు

- ఏకశిల కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మూడు గంటలకు పైగా ఉద్రిక్తత పరిస్థితులు

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని హనుమాన్‌నగర్‌లోని ఏకశిల జూనియర్ కళాశాల ఎదుట బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు.. మృతిచెందిన విద్యార్థిని బంధువులతో కలిసి ధర్నా నిర్వహించారు. కళాశాల యాజమాన్య బాధ్యతారాహిత్యంతోనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని శ్రీదేవి ఆత్మహత్యకు పాల్పడిందని, యాజమాన్యంపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మొదట బాలుర హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాలు.. యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో భవనం పైకి రాళ్లు రువ్వడంతో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు పరిస్థితులు చేయి దాటిపోతున్నాయని గమనించి విద్యార్థి సంఘాలపై లాఠీ ఝులిపించారు. చెల్లాచెదురైన విద్యార్థి సంఘాలు అరగంట తర్వాత తిరిగి బాలికల క్యాంపస్‌కు చేరుకుని నిరసనను ఉధృతం చేశారు. సుమారు మూడు గంటలకు పైగా కళాశాల పరిసర ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. ఫీజుల పేరిట విచ్చలవిడిగా దోచుకుంటున్నారని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఏకశిల కళాశాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏకశిల యాజమాన్యానికి షోకాజ్ నోటీస్

- డీఐఈఓ గోపాల్

విద్యారణ్యపురి: హనుమకొండలోని డబ్బాల ప్రాంతంలో ఉన్న ఏకశిల జూనియర్ కాలేజీలో విద్యార్థిని గుగులోత్ శ్రీదేవి మృతిపై యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీచేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి (డీఐఈవో) ఎ. గోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కళాశాల, విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ కేర్‌టేకర్‌తో మాట్లాడి ఆరాతీశారు. అనంతరం కళాశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీశారు. విద్యార్థిని మృతికి కారణాలేమిటి? ఎలా చనిపోయిందనే పూర్తి వివరాలతో కూడిన వివరణ త్వరితగతిన ఇవ్వాలని ఆ షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నట్లు డీఐఈఓ తెలిపారు. శ్రీదేవి మృతిపై ప్రాథమిక రిపోర్టును ఇంటర్‌విద్య సెక్రెటరీకి కూడా పంపామని తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు, పోలీసుల ఎఫ్ఐఆర్ వచ్చాక పూర్తిస్థాయి నివేదికను ఇంటర్‌విద్య సెక్రెటరీకి అందజేస్తామని గోపాల్ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి?

- ఏకశిల ఆస్పత్రిలో భర్త, బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

హన్మకొండ చౌరస్తా: వైద్యుల నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని ఆరోపిస్తూ హనుమకొండ ఏకశిల (మ్యాక్స్‌కేర్) ఆస్పత్రిలో మృతురాలి భర్త, బంధువులు ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త బస్కే రమేశ్, బంధువుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని తోపనపల్లి గ్రామానికి చెందిన బస్కే రవళి(26) కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఈ నెల 20వ తేదీన హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రికి వచ్చింది. పరీక్షలు చేసిన వైద్యులు మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించి రవళిని అడ్మిట్ చేసుకుని చికిత్స ప్రారంభించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న రవళి మృతి చెందిందని మంగళవారం రాత్రి ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రవళి మృతి చెందిందని ఆరోపిస్తూ వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. మృతురాలికి 18 నెలలు, 8 నెలల వయస్సు గల ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ బోరున విలపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా కిడ్నీలో రాళ్లు తొలగించేందుకు చేసిన ఆపరేషన్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, అందుకు సంబంధించిన అన్నీ విషయాలను వారికి వివరించామని తెలిపారు.

‘భద్రకాళి’పై శీతకన్నేనా?

దేవాలయ అభివృద్ధికి ఇంకెన్నేళ్లు!

- అడుగుపడని మాడవీధుల నిర్మాణం
- నీరు తొలగించినా పూడిక తీత ఆలస్యం
- నత్తనడకన చెరువు సుందరీకరణ పనులు
- అమలుకాని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆదేశాలు



నిలిచిపోయిన భద్రకాళి చెరువు పూడికతీత పనులు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయం.. వరంగల్ నగరంలో పురాతన పుణ్యక్షేత్రం. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఆలయం. కాకతీయులతో పూజలందుకున్న మహిమాన్విత క్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను వేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాది క్రితమే ఆలయం విస్తరణ, చుట్టూరా మాడవీధులు, సుందరీకరణ, తదితర అభివృద్ధి పనుల కోసం దేవాదాయ ధర్మదాయ శాఖ, ‘కుడా’ అధికారులు సంయుక్తంగా నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. అయితే అనుమతులు వచ్చినా పనులు ఎక్కడేసిన వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. స్వయంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పలుమార్లు పర్యటించి ఆలయ ప్రాంగణం, చెరువును మరింత అభివృద్ధి చేసి పర్యాటక శోభ తీసుకొస్తామని ప్రకటించినా అరకొర నిధుల మంజూరుకే పరిమితమైంది. గతేడాది ప్రారంభమైన మాడవీధుల నిర్మాణ పనులు అడుగు ముందుకు.. రెండు అడుగు వెనక్కు అన్న చందంగా నడుస్తోంది. ఇది ఇలా ఉండగా ఇటీవల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రెండు జిల్లాల కలెక్టర్లతో కలిసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మరో మంత్రి కొండా సురేఖ పర్యటించి చెరువును శుద్ధి చేసి గోదావరి జలాలతో నింపి నగరానికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పనులు సైతం శరవేగంగా ప్రారంభించి చెరువులోని నీటిని పూర్తిగా తొలగించడంతో నేడు బోసిపోయి కనిపిస్తోంది. కానీ పూడికతీత పనులు నత్తనడకనే కొనసాగుతున్నాయి. ఫలితంగా భద్రకాళి చుట్టూరా మాడవీధుల అభివృద్ధి ఇంకెన్నేళ్లు..? అనే సందేహం కలుగుతోంది..

అడుగుపడని మాడవీధుల నిర్మాణం

పురాతన పుణ్యక్షేత్రం భద్రకాళి దేవాలయం. ఆలయానికి ఒకపక్క ఎత్తైన కొండ, మరోపక్క ఆహ్లాదం పంచే చెరువు. ఈ నేపథ్యంలో ఆలయం చుట్టూ మాడవీధులు నిర్మాణం చేపట్టాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. చిన్న అభివృద్ధి పనులు చేసి వదిలేశారు. ఏటా లక్షల మంది అమ్మవారిని సందర్శిస్తున్నా కనీసం స్నానఘట్టాలు, మరుగుదొడ్లు లేకపోవడం ఈ క్షేత్రం దుస్థితిని తెలియజేస్తుంది. మాడవీధుల నిర్మాణం కోసం కోసం గత ప్రభుత్వ రూ.30 కోట్లు కేటాయించింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.20కోట్లు, ‘కుడా’ నుంచి రూ.10 కోట్ల నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. మాడవీధుల నిర్మాణంలో భద్రకాళి చెరువు 60 అడుగులు ముందుకు జరపనున్నట్లు ప్లాన్‌లో భాగం. చెరువు ఖాళీగా ఉన్నప్పుడు ఈ పని సులభమవుతుందని ఇంజనీరింగ్ నిపుణుల అభిప్రాయం. కానీ ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీనిపై ఆరా తీయడానికి యత్నించగా ‘కుడా’ అధికారులు స్పందించకపోవడంతో నిర్లక్ష్యం కనిపిస్తుంది.

నిలిచిన చెరువు శుద్ధి..

భద్రకాళి దేవాలయాన్ని అభివృద్ధి చేసి ఆలయ చుట్టూ మాడవీధులు ఏర్పాటు చేయాలని, చెరువును శుద్ధి చేసి నగరానికి తాగునీరు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి నగరవాసులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచే గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు వెళ్తూ వచ్చింది. ఈ లోపు ఎన్నికల వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడంతో నగర ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. మంత్రుల పర్యటనతో భద్రకాళి చెరువుశుద్ధి చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. వారం రోజుల్లో నీటిని తొలగించారు. కానీ పూడిక తీత పనులు అక్కడికక్కడే నిలిచిపోయాయి. ఒకవైపు మాడవీధుల నిర్మాణాలు, మరోవైపు చెరువు శుద్ధికరణ పనులు జరగక రెంటికి చెడ్డ రేవడిలా మారింది.

ట్రాక్టర్లు బురదలోకి రావడం కష్టంగా ఉంది..

ప్రణాళిక ప్రకారం భద్రకాళి చెరువు శుద్ధి పనులు కొనసాగుతున్నాయి. నీటిని పూర్తిగా తొలగించాం. పూడికతీత పనులు ప్రారంభించాం. కానీ బురద ఉండడంతో చెరువులోకి ట్రాక్టర్లు రావడం కష్టంగా ఉండడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. బురద ఎండిన తరువాత పనులు వేగవంతమవుతాయి. చెరువు అభివృద్ధిపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించింది.

- హర్షవర్ధన్, డీఈఈ, నీరుపారుదల శాఖ, వరంగల్

ఖండాంతరాలు దాటొచ్చి కలుసుకుని..

- రామప్ప వేదికగా కలుసుకున్న ఉమ్మడి కుటుంబం
- రామలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



రామప్ప ఆలయం వద్ద వెంకట్రాజం కుటుంబ సభ్యులు

వెంకటాపురం(ఎం): ఆస్తి, భూమి, ఇతర అవసరాల కోసం ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడి పలకరింపులే కరువైన ఈ రోజుల్లో.. ఏకంగా ఉమ్మడి కుటుంబానికి చెందిన 80 మంది ఒకేచోట కలుసుకున్నారు. వీరి కలయికకు చారిత్రక రామప్ప దేవాలయం వేదికైంది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన సింగిరికొండ వెంకట్రాజం, వజ్రమ్మ దంపతుల కుమారులు, కూతుళ్లు తమ కుటుంబసభ్యులతో రామప్ప ఆలయానికి తరలివచ్చారు. అమెరికా, రష్యా, పూణె, నెదర్లాండ్, లండన్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో నివసిస్తున్న కుటుంబసభ్యులు బుధవారం రామప్ప ఆలయ కేంద్రంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఫొటోలు దిగి సందడి చేశారు.

హెర్బల్ మందు పేరుతో మోసం..

- మందు వికటించి ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స



వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

చెన్నారావుపేట/ఎంజీఎం: మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళను ఓ కి ‘లేడీ’ హెర్బల్ మందు పేరుతో మోసం చేసింది. తానిచ్చే మందు 15 రోజులు వాడితే జీవితాంతం వ్యాధి దరిచేరదని నమ్మబలికి రూ. 3వేలు దండుకుంది. నమ్మిన బాధితురాలు రెండు, మూడు రోజులు ఈ మందు వాడిన తరువాత వికటించడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో బుధవారం తెలంగాణ వైద్యమండలి సభ్యులు.. బాధితురాలిని పరామర్శించి ఘటనపై ఆరా తీశారు. చెన్నారావుపేట మండలం బోజేర్వుకు చెందిన యాదలక్ష్మి కుమారుడితో కలిసి పుట్టింటి వద్ద ఉంటుంది. కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతూ అల్లోపతి వైద్యం తీసుకుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 16న వరంగల్‌కు చెందిన కవిత.. యాదలక్ష్మి వద్దకు వచ్చి తానిచ్చే హెర్బల్ మందు వాడితే 15 రోజుల్లో మూర్ఛ తగ్గుతుందని, ఇకపై ఇతర మందులు వాడాల్సిన అవసరం ఉండదని నమ్మబలికింది. దీంతో నమ్మిన యాదలక్ష్మి రూ.3వేలు చెల్లించి పేరు, అడ్రస్ లేని డబ్బాలో ఉన్న మందులు కొనుగోలు చేసి 3 రోజులు వాడింది. ఈ నెల 19న అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతోంది. హెర్బల్ మందులు వాడడంతో లివర్, కిడ్నీ దెబ్బతిని ప్రాణం మీదకు వచ్చిందని వైద్యులు తెలిపారు. కాగా, ఈ ఘటనపై చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. నాటు వైద్యం నమ్మొద్దన్నారు.

మా బాపు లబ్బరి కట్టెతో కొట్టాడు..

- అదే నన్ను ఈ స్థాయిలో నిలిపింది
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



హాస్టల్ నిద్ర చేస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: ‘బడికి పోక పోతే మా బాపు (నాన్న) నన్ను లబ్బరి కట్టెతో కొట్టాడు’ అని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హాస్టల్ నిద్రలో భాగంగా బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించారు. ముందుగా విద్యార్థులతో తన బాల్యాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ‘మా బాపు ఆ రోజు కొట్టిన దెబ్బ నన్ను ఈరోజు ఈస్థాయికి చేర్చిందని, ఇప్పటికి చదువుకోవాలనే తపన కల్పించింది’ అని అన్నారు. తాను కష్ట పడినట్లు తన పిల్లలు కష్ట పడకూడదని ప్రతీ తల్లి తండ్రి కోరుకుంటారని, వారిని వృద్ధాప్యంలో చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. అందరూ అలా చూసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మారిన మెనూ అందుతుందా?

విద్యార్థులకు నాణ్యమైనవిద్యతోపాటు పౌష్టికాహారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైట్, కాస్మొటిక్ చార్జీలు 40శాతం పెంచారని, ఆ ప్రకారం మెనూ అందుతుందా అని మంత్రి.. విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందుతుందని, పెంచినందుకు ప్రభుత్వానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో ట్రాక్ (సీసీ రోడ్డు), తాగు నీటి బోరు, అదనపు మరుగుదొడ్లు అవసరం ఉన్నాయని విద్యార్థులు అడిగారు. స్పందించిన సీతక్క వారం రోజుల్లో ఎస్టిమేషన్ చేయించి పనులు అయ్యే విధగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలసి నృత్యం చేశారు. రాత్రి అక్కడే నిద్రించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, సారయ్య, రణధీర్, పుష్పలత, రూప్‌సింగ్, గుమ్మడి సమ్మయ్య పాల్గొన్నారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- కిలో వెండి, రూ.5వేల నగదు అపహరణ
- రామాలయ వీధిలో ఘటన



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి వరంగల్ రంగశాయిపేట రామాలయ వీధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగశాయిపేట ప్రాంతానికి చెందిన సునీల్ కుటుంబంతో కలిసి రామాలయ వీధిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి వేరే ఊరుకు వెళ్లాడు. బుధవారం తిరిగా రాగా తాళం ధ్వంసం చేసి ఇంటి గడియ తీసి ఉండడాన్ని గమనించి ఆందోళనతో లోపలికి వెళ్లాడు. బీరువాలో భద్రపరిచిన కిలో వెండి, రూ . 5వేల నగదు కనిపించలేదు. దీంతో ఈ విషయాన్ని వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు తెలిపాడు. పోలీసులు, క్లూస్ టీమ్ బృందం ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుడు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.